



RNI - TELTEL/2023/87644


# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 237 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 15-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00



## సిడ్నీ బీచ్‌లో ఉగ్రదాడి

- కాల్పుల్లో 11 మంది మృతి, 29 మందికి గాయాలు
- ఆస్ట్రేలియాలో ఘటన
- దుండగుడితో పర్యాటకుడి పెనుగులాట

సిడ్నీ

ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఇద్దరు సాయుధ దుండగులు బీభత్సం సృష్టించారు. బాండీ బీచ్‌లో పర్యాటకులు ఉల్లాసంగా గడుపుతున్న సమయంలో బీచ్‌లోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దీంతో వందల మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. ఈ క్రమంలో దుండగులు జరిపిన కాల్పుల్లో 11 మంది మృతిచెందగా.. 29 మంది గాయపడ్డారు. ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కాల్పులు కలకలం రేపాయి. కాల్పులు మొదలైన వెంటనే అక్కడున్నవారు నేలపై పడిపోవడం, దాక్కోవడం, కొందరు సముద్రం వైపు పరుగులు తీయడం వంటి దృశ్యాలు చోటుచేసుకున్నాయి.

**నల్లటి దుస్తులు ధరించిన ఇద్దరు దుండగులు**

గాయపడినవారిలో పర్యాటకులతో పాటు స్థానికులు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మృతుల్లో చిన్నారి

-మిగతా 2 లో



## బీజేపీ కోసమే ఈసీ

### సత్యం, అహింసతో ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఓడిస్తాం

- ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా కేంద్రం, ఈసీ :
- 'ఓటు చోర్ గద్దీ ఛోడ్' మెగా ర్యాలీలో రాహుల్ గాంధీ
- మోడీ సర్కార్‌ను అధికారం నుంచి తొలగించాలి : ఖర్గే

**న్యూఢిల్లీ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "మేం 'సత్యం'తో నిలబడతాం. మోడీ–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగిస్తాం. అధికారం కోసం వారు 'ఓటు చోరీ'లో మునిగిపోయారు." అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. తమకు ప్రజాస్వామిక సిద్ధాంతాలపై నమ్మకం ఉందని, సత్యం గెలవడానికి సమయం పట్టినా, అంతిమ విజయం మాత్రం సత్యానిదేనని అన్నారు. తాము సత్యాహింసలతో పనిచే స్తామని చెప్పారు. ఆదివారంనాడిక్కడ రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓటు చోర్ గద్ది ఛోడ్' మెగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో ం

-మిగతా 2 లో

# మళ్లీ హస్తానిదే హవా


### రెండోవిడత పంచాయతీ పోరులో 2,241 మంది కాంగ్రెస్ మద్దతుదారుల గెలుపు

- బీఆర్ఎస్ 1,186, బీజేపీ 268, ఇతరులు 624
- నల్లగొండ, కామారెడ్డిలలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్
- సిద్దిపేట, కరీంనగర్, ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఆధిక్యం
- పోటెత్తిన ఓటు..85.86 పోలింగ్
- అత్యధికంగా భువనగిరిలో 91.72 శాతం
- అత్యల్పంగా నిజామాబాద్‌లో 71.79




**హైదరాబాద్ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండోవిడత పంచాయతీ ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మొదటి విడతలో అత్యధిక స్థానాలు గెలుచుకుని జోష్ మీదున్న ఆపార్టీ.. రెండో విడతలోనూ మెజారిటీ సర్పంచ్ స్థానాలను దక్కించుకుంది. ఆదివారం జరిగిన పోలింగ్‌లో 3,911 సర్పంచ్ స్థానాలకు 12,782 మంది, 29,917 వార్డు స్థానాలకు 71,071 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 2,241 స్థానాల్లో గెలుపొందారు. బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులు 1,186 స్థానాల్లో గెలిచారు. బీజేపీ 268 చోట్ల, ఇతరులు

-మిగతా 2 లో



## చలి పంజా

- మూడు నుంచి నాలుగు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత
- ఎల్లో అలర్ట్ జారీ..బెంబేలెత్తుతున్న జనం..
- ఆరోగ్యరక్షణ చర్యలు అవసరం : వైద్యులు

**హైదరాబాద్ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ చలికి వణకుతోంది. దీనికి తోడు ఉత్తర, మధ్య, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో చలిగాలు లు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. ఆది, సోమవారాల్లో కనిష్ట ఉషోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది

**బెంబేలెత్తుతున్న జనాలు**

గత కొద్ది రోజులుగా వరసగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల కంటే తక్కువకు పడిపోతుండటంతో

-మిగతా 2 లో



## ఇజ్రాయిల్ చర్యలు శాంతికి విఘాతం

- దాడుల నేపథ్యంలో హమాస్ నేత వెల్లడి

కైరో

కాల్పుల విమరణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ పదేపదే దాడులకు పాల్పడుతుండటం గాజా ప్రాంతంలో శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని హమాస్ తరపున శాంతి చర్చల్లో పాల్గొన్న ప్రధాన సంధానకర్త (ఛీఫ్ నెగోషియేటర్) ఖలీల్ అల్ హయ్యా అన్నారు. ఈ నెల 13న హమాస్ కమాండర్లను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో సీనియర్ కమాండర్ రయీద్ సయీద్ హత్యకు గురైనట్టు ఖలీల్ ధ్రువీకరించారు. ఈ ఘటనపై ఆదివారం నాడు ఆయన ఒక టివి ప్రతినిధితో మాట్లాడుతూ అమెరికా మధ్యవర్తిత్వంతో గాజాలో కాల్పుల విరమణ ఒప్పదం అమల్లోకి వచ్చిన తర్వాత హమాస్ అగ్రశ్రేణి నాయకులను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ జరిపిన తొలిదాడి ఇదేనని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయిల్ పదేపదే కాల్పుల విరమణను

-మిగతా 2 లో

## పొలిటికల్ గా టెంప్ట్ కావొద్దు

- డిస్టర్బ్‌లో ఐతే ఉన్నా..మేలో చెప్తా
- ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి
- నాది స్టేట్ ఫార్వర్డ్ రాజకీయం
- హరీశ్‌రావు వెనుకపోటు రాజకీయం
- హరీశ్‌రావు వల్లనే పార్టీ మారారనే కవిత స్టేట్‌మెంట్ సరిగాదు



**హైదరాబాద్ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 'సీఎం అవుతా అని ఎవరైనా అంటే నాకు సిగ్గు అవుతున్నది. ఏం అనుకుంటున్నారో ఏమో? అలాంటి మాటలు వింటుంటే చిరాకు వస్తున్నది. నేను కొంత డిస్టర్బ్ అయిన మాట వాస్తవం. అందుకే ఎవరి ఫొటోలు వద్దు రాహుల్ గాంధీ ఫొటో ఒక్కటే పెట్టండి అని చెప్పిన. అన్నీ ఇప్పుడే చెప్పను. సమయం వచ్చినప్పుడు చెప్తా. మొత్తం మీద డిస్టర్బ్‌లో ఐతే ఉన్నా. మేలో అసలు విషయం చెప్తా. ఎవరి వల్ల డిస్టర్బ్ అయినది చెప్తా. పొలిటికల్‌గా ఎప్పుడూ టెంప్ట్ కావొద్దు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటా.

-మిగతా 2 లో



## ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు

- మేము తిరగబడితే తట్టుకోలేరు
- ఉప్పల మల్లయ్య కుటుంబానికి అండగా బీఆర్ఎస్
- మాజీమంత్రి కేటీఆర్ హామీ

**నూతనకల్ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్‌నేతలు తమ పార్టీ నేతలపై దాడులకు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. 'మేము తిరగబడితే రాష్ట్రం ఆగమైతది.. పదేండ్లు మేము అధికారంలో ఉన్నాం.. ఏనాడూ మీలాగా ఆలోచించలేదు.మేము కూడా మీలాగే ఆలోచించి ఉంటే ఈరోజు కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ పరిస్థితి ఉండేదా?" అని హెచ్చరించారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా దిక్కుమాలిన రాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు కొనసాగితే తాము కూడా తిరగబడక తప్పదన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం, నూతనకల్ మండల పరిధిలోని

-మిగతా 2 లో




## సీనియర్ అధికారుల ఆదేశాల మేరకే ట్యాపింగ్

- మూడోరోజు సిట్ ముందు ప్రభాకర్‌రావు వాంగ్మూలం

హైదరాబాద్

తన సీనియర్ల ఆదేశం మేరకే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం నడిచిందని ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు సిట్ అధికారుల ముందు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. ఆదివారం మూడోరోజు సిట్ అధికారులు ప్రభాకర్‌రావును జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావును తమ కస్టడీలోనే ఉంచుకొని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్న విషయం విదితమే. ఏడు రోజుల పాటు కస్టడీకి సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.గత ప్రభుత్వ హయాంలో సాగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్న సిట్ అధికారులు.. ఎస్ఐబీ మాజీ చీఫ్ నుంచి నిజాలను రాబట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తాము ప్రశ్నించిన నలుగురు పోలీసు అధికారుల నుంచి రాబట్టిన సమాచారంతో పాటు తమ ఫోన్లు ట్యాపింగ్ చేశారని తెలిపిన అనేక మంది బాధితుల నుంచి సేకరించిన

-మిగతా 2 లో

## విశ్వనగరమంటే ఇదేనా?

- తాగునీరు కలుషితం
- సగానికి తగ్గిన ఆర్టీసీ బస్సులు
- వరుసగా వృద్ధుల హత్యలు
- బస్తీల్లో పెరిగిన డ్రగ్స్ వాడకం
- ఆడపిల్లలపై ఆగని ఆగడాలు
- 31 శాతం పెరిగిన డాగ్ బైట్స్
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 'హైదరాబాద్‌లోని కొన్ని చోట్ల తాగునీటిలో మురికి నీరు కలుస్తోంది. మరి కొన్ని చోట్ల తాగునీరు పెట్రోల్ వాసన వస్తోంది. ప్రతి నిత్యం నగరంలో ఏదో ఒక చోట వృద్ధుల హత్యలు జరుగుతున్నాయి. బస్తీల్లో ఖాళీలు స్థలాలను చెత్త డంపింగ్ కు యథేచ్ఛగా ఉపయోగించుకుంటున్నారు. అక్కడే డ్రగ్స్, గంజాయి వాడకం ఎక్కువగా ఉంటోంది. ఆ దారుల్లో వెళ్లే ఆడపిల్లలపై నిత్యం ఆగడాలు జరుగుతున్నాయి. మరోవైపు వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి స్టెరిలైజ్ కోసం కేటాయించిన నిధులను సరిగా

-మిగతా 2 లో



# సిడ్నీ బీచ్‌లో ఉగ్రదాడి

మొదటి తరువాయి

సహా ఓ పోలీసు అధికారి ఉన్నట్టు ఆస్ట్రేలియా మీడియా పేర్కొంది. గాయపడిన 29 మందిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఇద్దరు పోలీసు అధికారులు ఉన్నారని వారి పరిస్థితి విషమంగా ఉందని న్యూ సౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ తెలిపారు. నల్లటి దుస్తులు ధరించిన ఇద్దరు దుండగులు సర్ఫ్‌క్లబ్ పక్కనే ఉన్న పాదచారుల వంతెనపైకి చేరుకొని కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

దుండగుడితో పర్యాటకుడి పెనుగులాట


కాల్పులు జరుపుతున్న దుండగుడిని ఓ పర్యాటకుడు అడ్డగించి అతడి చేతులో ఉన్న తుపాకీ లాక్కొని కాల్చేందుకు ప్రయత్నించాడు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాల్పుల సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు కాల్పులు జరిపారు. ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు కాల్పులు జరపగా ఒక దుండగుడు హతమయ్యాడు. మరొకడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఇది ఉగ్రదాడి

మృతిచెందిన దుండగుడికి చెందిన కారులో ఐఈడీని గుర్తించిన పోలీసులు వెంటనే బాంబ్ డిస్పోజల్ యూనిట్‌కు సమాచారమిచ్చారు. ఇది ఉగ్రదాడి అని న్యూ సౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ తెలిపారు. చనిపోయిన దుండగడి కారులో ఐఈడీని గుర్తించామని చెప్పారు. కౌంటర్ టెర్రరిజంకు చెందిన బృందం దర్యాప్తు చేపడుతుందని వెల్లడించారు. సిడ్నీలోని యూదులను లక్ష్యంగా చేసుకొని దుండగులు కాల్పులకు పాల్పడినట్టు అనుమానిస్తున్నామని న్యూ సౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ తెలిపారు. కాల్పులు జరిగిన సమయంలో బాండీ బీచ్‌లో దాదాపు వెయ్యి మంది ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# చలి పంజా

మొదటి తరువాయి



ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. బహిరంగ ప్రాంతాలు, శివారుల్లో చలిగాలుల తీవ్రత మరింత ఎక్కువగా ఉండటంతో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ప్రధానంగా చిన్నారులు, వ ృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు అనేవి ఎక్కువగా తలెత్తుతున్నాయి. చర్మం పగుళ్లు బారడం, కండ్ల నుంచి నీళ్లు రావడం లాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో రహదారులపై మంచు దుప్పటి పరుచుకున్నట్టుగా ఉంటుంది. అనేక జిల్లాల్లో ఉదయం పూట రోడ్లపై మంచు కురుస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా వాహనచోదకులకు కనిపించడం లేదు. ఉదయాన్నే రోడ్లపై వ్యాపారాలు నిర్వహించుకునే వారు చలికి తట్టుకోలేక కాగితాలు,లేదా చెక్కముక్కలు వేసి నిప్పు కాచుకుని సేదదీరుతున్నారు. చలిగాలులు వీస్తున్న నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

**చలి నుంచి రక్షణ అవసరం**

ఎలర్జీ సమస్యలున్న వారు చెవులు, ముక్కు, నోటి ద్వారా చల్లగాలి లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలను పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు బయటకు వెళ్లేటప్పుడు శరీరానికి వెచ్చదనాన్ని ఇచ్చే వస్త్రాలను ధరించడం మంచిదని చెబుతున్నారు.

## ఇజ్రాయిల్ చర్యలు శాంతికి విఘాతం

మొదటి తరువాయి

ఉల్లంఘించి ఇలా దాడులకు తెగించడం శాంతి ప్రక్రియకు తీవ్ర విఘాతం కల్గిస్తోందని తెలిపారు.కాల్పుల విరమణ ఒప్పందానికి హామీదారుగా ఉన్న అమెరికా ప్రభుత్వ యంత్రాంగం, ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తక్షణమే జోక్యం చేసుకొని ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు కట్టుబడివుండేలా చర్యలు తీసుకోవాలని ఖలీల్ డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ హత్య చేసిన సయీద్ ..హమాస్‌లో అత్యంత కీలక నేత. సాయుధ దళానికి అధిపతిగా ఉన్న ఐజ్ ఎల్దీన్ అల్ హదద్ తర్వాతి నేతగా సయీద్‌కు పేరుంది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్) ఏర్పాటుపైనా హయ్యా స్పందించారు. ఐఎస్ఎఫ్ బలగాలు కేవలం కాల్పుల విరమణ ఒప్పందం అమలయ్యేలా చూడడానికి, గాజా సరిహద్దుల వెంబడి ఇరు పక్షాలను వేరు చేయడానికి మాత్రమే పరిమితం కావాలన్నారు. అంతేగానీ గాజా స్ట్రిప్‌లో ఐఎస్ఎఫ్‌కు ఎటువంటి పాత్ర ఉండరాదని, అంతర్గత వ్యవహారాల్లో ఏపాటి జోక్యం కూడా చేసుకోరాదని హయ్యా పేర్కొన్నారు.

## పొలిటికల్ గా టెంప్ట్ కావొద్దు

మొదటి తరువాయి

వార్ ప్రకటిస్తే కొనసాగించాలి. మే వరకు వ్యూహం రచించే పనిలో ఉంటా. ఒక్కసారి డిసైడ్ అయితే వెనక్కి రాను. ముందకేవెళ్తా. ప్రచార కమిటీ చైర్మెన్ పదవిపై పెద్దగా ఆసక్తి లేదు' అంటూ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి బాంబు పేల్చారు. హరీశ్‌రావు మీద కోపంతో బీఆర్ఎస్ పార్టీని జగ్గారెడ్డి వీడారనే కవిత వ్యాఖ్యలను కొట్టిపడేశారు. అలాంటి స్టేట్‌మెంట్లు ఇవ్వడాన్ని మానుకోవాలని సూచించారు. తాను డైరెక్ట్‌గా రాజకీయం చేస్తాననీ, హరీశ్‌రావు వెనుక నుంచి పొడుస్తాడు అంటూ కామెంట్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం కాబట్టి టార్గెట్‌గా పనిచేస్తారనీ, రాజకీయంగా ఎప్పుడైనా ఘర్షణ వాతావరణం ఉంటుందని తెలిపారు. జగ్గారెడ్డి అసలు పార్టీ ఎందుకు మారాడు అనేది ఎవరికి తెలియదన్నారు. హరీశ్‌రావు మీద కోపంతో, వ్యతిరేకంతో పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ కూతురు కాబట్టి కవిత లీడర్ అయ్యిందని విమర్శించారు. తాను క్షేత్రస్థాయి నుంచి రాజకీయంగా ఎదిగానని చెప్పారు. కుటుంబ పంచాయితీలో తనను ఎందుకు ఇరుకిస్తున్నావని కవితను ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కారణమనీ, తన రాజకీయం నచ్చి ఆప్తమిత్రుడు కుసుమ కుమార్ తో కబురు పంపించారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తనను తట్టుకోలేకనే ఎస్పీ వ్యాస్‌కు సంగారెడ్డిలో పోస్టింగ్ ఇచ్చారని చెప్పారు. తనను హౌస్ అరెస్టు చేస్తే కసితో జనం ఓట్లేసి గెలిపించారని గుర్తుచేశారు. అప్పుడు వైఎస్ దగ్గరకు తనను కుసుమ తీసుకెళ్లాడనీ, ఇష్టపూర్వకంగానే కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. దాని ఫలితంగానే ఐఐటీ, ఫోర్‌లైన్ హైవే వచ్చాయని తెలిపారు. ఐఐటీ కోసం రైతులు అడిగినంత పరిహారం ఇచ్చి అడిగిన 600 ఎకరాల భూమి ఇప్పించామని గుర్తుచేసుకున్నారు. ఐఐటీ ఇస్తా దాని దగ్గర భూమి కొను వైఎస్ సూచిస్తే పట్టించుకోలేదన్నారు.

# బీజేపీ కోసమే ఈసీ

మొదటి తరువాయి

రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ కోసం పని చేస్తోందని విమర్శించారు. మోడీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడానికి సత్యం, అహింసతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పేర్లను ప్రస్తావించి వారు బీజేపీ కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈసీ అనేది దేశం కోసమని, మోడీకి పరిమితం కాదని, ఈ విషయం గుర్తించాలని సూచించారు. ఎన్నికల సమయంలో బీజేపీ ఓటర్లకు రూ.10,000 బదిలీ చేసినా, ఈసీ వారిపై ఎటువంటి చర్యా తీసుకోలేదన్నారు. ఎన్నికల సంఘానికి ఇమ్యూనిటీ కల్పిస్తూ ప్రధాని మోడీ కొత్త చట్టాన్ని తెచ్చారని, భవిష్యత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టాన్ని మార్చి, అవసరమైతే ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ శాంతియుత, ప్రజాస్వామ పంథాలోనే పోరాటం సాగిస్తుందన్నారు. ప్రపంచం సత్యం వైపు చూడదని, అధికారం వైపు చూస్తుందని, అధికారం ఉన్నవాడినే గౌరవిస్తుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చెబుతున్నారని రాహుల్ విమర్శించారు. ఇది మోహన్ భగవత్ ఆలోచన అని, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని తెలిపారు. ప్రపంచంలోని ప్రతి మతం సత్యమే



ప్రధానమని చెబుతుందన్నారు. సత్యానికి అర్థమే లేదని, అధికారమే కీలకమని మోహన్ భగవత్ అంటున్నారని విమర్శించారు. 'సత్యాన్ని ఆచరిస్తూ, సత్యానికి అంటిపెట్టుకుని ఉంటే మోడీని, అమిత్ షాను, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని ఇండియా నుంచి తొలగించవచ్చని ఈ సభా వేదిక నుంచి తెలియజేస్తున్నాను' అని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

**అధికారం నుంచి తొలగించాలి: ఖర్గే**

'ఓటు చోరీ' చేసేవారు 'ద్రోహులు' అని, ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడటానికి వారిని అధికారం నుంచి తొలగించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. కాంగ్రెస్ భావజాలాన్ని ఐక్యంగా బలోపేతం చేయడం భారతీయులందరి కర్తవ్యమని, పార్టీ మాత్రమే దేశాన్ని రక్షించగలదని చెప్పారు. ఆర్ఎస్ఎస్ భావజాలం దేశాన్ని అంతం చేస్తుందని ఆయన ఆరోపించారు. "బీజేపీ వాళ్లు గద్దార్ (ద్రోహులు). ఆ పార్టీ నాయకులు నాటకాలాడుతున్నారు. 'పార్లమెంటు సమావేశాల తర్వాత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్తున్నారా?' అని కొంతమంది బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రధాని మోడీ ఎప్పుడూ సమావేశాలకు హాజరుకారు. విదేశాలకు వెళతారు. ఓటు చోరీ చేసిన తర్వాత వారందరూ అధికారంలో కూర్చున్నారు. ఈ ద్రోహులను అధికారం నుంచి తొలగించాల్సి ఉంది" అని ఆయన అన్నారు.

**దేశంలో నిష్పాక్షిక ఎన్నికలు జరగడం లేదు : ప్రియాంక**

దేశంలో ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించడం లేదని, ప్రక్రియ ప్రతి దశను ఇప్పుడు అనుమానం చుట్టుముట్టిందని ప్రియాంక గాంధీ అన్నారు. ప్రజల ఓటు హక్కును హరించడానికి వారు ఎలా 'కుట్ర' చేశారో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య నిబంధనలను క్రమబద్ధంగా క్షీణింపజేస్తున్నారని ఆరోపించారు. "మన స్వరం ప్రధానమంత్రి నివాసానికి చేరుకోవాలి. మీ ఓటు సమాజ మార్పులో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అర్థం చేసుకోవడం చాలా ఆవశ్యం. రాజ్యాంగం మీకు ఓటు హక్కును ఇచ్చింది" అని ఆమె చెప్పారు. ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయాలని రాజ్యాంగ సంస్థలు ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు.

# మళ్లీ హస్తానిదే హవా

మొదటి తరువాయి

624 స్థానాల్లో విజయం సాధించారు. నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ సత్తా చాటింది. ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గణనీయ సంఖ్యలో గెలుపొందారు. సిద్దిపేట, కుమరంభీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధిక్యాన్ని కనబర్చింది. మెదక్, రంగారెడ్డి, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతు దారులు గట్టి పోటీ ఇచ్చారు. నిర్మల్ జిల్లాలో అనూహ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వెనక్కి నెట్టి బీజేపీ మద్దతుదారులు మెజార్టీ స్థానాలను దక్కించుకు న్నారు. అదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. జగిత్యాల, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ఆ పార్టీ అభ్యర్థులు రెండంకెల మార్కును దాటారు. మొదటి రెండు విడతల్లో కాంగ్రెస్ అభ్యర్థు లు మెజార్టీ స్థానాలను దక్కించుకోగా, బీఆర్ఎస్ రెండవ స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ గెలిచిన 80 శాతానికి పైగా స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు రెండవ స్థానంలో నిలిచారు. ఆ తర్వాతి స్థానాలను ఇండిపెండెంట్లు 15 శాతం, బీజేపీ 5 శాతంగా నిలిచారు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ 50 శాతం వరకు స్థానాలు దక్కించుకోగా, బీఆర్ఎస్ 25 శాతం, ఇతరులు 25 శాతం స్థానాల్లో పాగా వేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, మరో మూడేండ్లు గడువున్న నేపథ్యంలో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. చివరి విడతలోనూ మొదటి, రెండో విడత ఫలితాలే పునరావృతం అవుతాయని భావిస్తున్నారు.

**రెండో విడతలో పెరిగిన పోలింగ్**

రెండోదశ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. మొదటి విడతలో 84.28 శాతం నమోదు కాగా, ఈ సారీ 1.58 శాతం పెరిగి 85.86 శాతంగా నమోదైంది. ఈ మేరకు తెలంగాణ ఎన్నికల సంఘం రెండో దశ పోలింగ్ వివరాలను వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడతలో 193 మండలాల్లోని 3,911 పంచాయతీలు, 71,071 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 91.72 శాతం, ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో 91.21, సూర్యపేటలో 89.56, మెదక్‌లో 88.80 శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 76.71 శాతం, ఆ తర్వాత జగిత్యాలలో 76.34, భద్రాది కొత్తగూడెంలో 82.65, నిర్మల్‌లో 82.67 శాతం పోలింగ్ నమోదైంది.

ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు కొంత మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 22.54 పోలింగ్ నమోదు కాగా, అ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 56.71 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చివరి వరకు మొత్తం 85.86 శాతానికి చేరుకుంది. ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 54,40,339 మంది ఓటర్లకు గాను 46,70,972 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 22,77,902 మంది పురుషులు (85.71 శాతం), 23,93,010 మంది మహిళలు (86 శాతం), 60 మంది ఇతరులు (41.96 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికల సంఘం తెలిపింది.

# విశ్వనగరమంటే ఇదేనా?

మొదటి తరువాయి

వినియోగించుకోకపోవడంతో రెండేండ్లలో కుక్కకాటు కేసులు 31 శాతం పెరిగాయి. ఆర్టీసీ బస్సులను సగానికి తగ్గించారు. సామాన్యులకు ప్రజా రవాణా అందుబాటులో లేకుండా చేశారు. వికలాంగులైతే ఆర్టీసీ బస్సులు ఎక్కే పరిస్థితే లేదు. ఇలాంటి నగరం విశ్వనగరం అవుతుందా? %%. ' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఐదు రోజుల పాటు ఆమె చేపట్టిన జనం బాట ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆదివా రం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశం లో మాట్లా డారు. జీహెచ్ఎంసీలో 27 మున్సిపాల్టీలను విలీనం చేసిన తర్వాత ఒక కోటి మందికి పైగా జనాభా పెరిగారని తెలిపారు. అంతకుముందు 7,700 ఆర్టీసీ బస్సులుంటే వాటిని 3,500కు తగ్గించారని తెలిపారు. ప్రజా రవాణా లేకపోవడంతో 80 లక్షల ప్రయివేటు వాహనాలను అనివార్యంగా ప్రజలు వినియోగించే పరిస్థితికి ప్రభుత్వమే కారణమమని ఆమె విమర్శించారు. 2022లో నగరంలోలో కుక్కకాటుకు సంబంధించి 92,924 నమోదైతే 2024 నాటికి 1,23,997 (31 శాతం) అధికంగా నమోదయినట్టు చెప్పారు. లంగర్‌హౌజ్ బాపూఘాట్‌ను డ్రగ్స్, గంజాయి తీసుకునే అసాంఘిక శక్తులు ఉపయోగించుంటున్నా నియంత్రణ చర్యలు లేవని తప్పుపట్టారు. యాకుత్‌పురా నియోజకవర్గంలో తాగునీటిలో మురికి నీరు కలిసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అడిక్‌మెట్‌లో వస్తున్న తాగునీరు పెట్రోల్ వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనత్‌నగర్ దాసరి బస్తీలో గంజాయి బ్యాచ్ రెచ్చిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంను పిల్లలు ఆడుకునేందుకు ఇవ్వకుండా వ్యాపార అవసరాల కోసం ప్రయివేటు వ్యక్తుల కార్యక్రమాలకు ఇస్తున్నారని కవిత ఆరోపించారు.

# సీనియర్ అధికారుల ఆదేశాల మేరకే ట్యాపింగ్



మొదటి తరువాయి

సమాచారాన్ని కూడా సిట్ అధికారులు క్రోడీకరించుకొని ప్రశ్నలను రూపొందించుకున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్‌ట్యాపింగ్ చేసే సమయంలో తాము ఎవరెవరి ఫోన్లను తప్పనిసరిగా ట్యాపింగ్ చేయాల్సి ఉందో సీనియర్ అధికారులతో కూడిన స్క్రీనింగ్ కమిటీకి పంపించాల్సి ఉంటుంది.

# ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు

మొదటి తరువాయి



లింగంపల్లి గ్రామంలో హత్యకు గురైన బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పలమల్లయ్య కుటుంబాన్ని కేటీఆర్ ఆదివారం పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళలర్పిం చారు. బాధితకుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని కేటీఆర్ అందజేశారు. మల్లయ్యపై హత్య జరిగిన వెంటనే రావాలనుకున్నా, ఉద్రిక్తతలు పెరగకూడదనే ఉద్దేశంతోనే కొద్దిరోజులు ఆగానని తెలిపారు. బాధిత కుటుంబానికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, రాగానే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కేవలం సర్పంచ్, పంచాయతీ ఎన్నికలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతగా భయపడుతోందని ఎద్దేవా చేశారు. రెండేండ్లలో అద్భుతాలు చేశామని, రుణమాఫీ, ఇండ్లు, రేషన్‌కార్డులు ఇచ్చామని కాంగ్రెస్ చెబుతున్న మాటలు నిజమే అయితే, ఎన్ని కలంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

# విజయవంతంగా ముగిసిన శ్రీ అరబిందో సొసైటీల 29వ వార్షిక సమావేశాలు




**కరీంనగర్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల శ్రీ అరబిందో సొసైటీల 29వ వార్షిక సమావేశాలు హైదరాబాద్‌లో డిసెంబర్ 13, 14 తేదీల్లో ఘనంగా జరిగాయి. మొదటి రోజు సమావేశాలు బేగంపేటలోని తెలంగాణ టూరిజం ప్లాజాలో నిర్వహించగా, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, సిద్దిపేట, నల్లగొండ, హైదరాబాద్‌తో పాటు ఏలూరు, భీమవరం, తెనాలి, విజయనగరం, వైజాగ్ వంటి ప్రాంతాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. ములుగు శ్రీనివాస్ సారథ్యంలో జరిగిన సభల్లో శ్రీ అరబిందో సాహిత్యం, ధ్యానం, సమగ్ర యోగంపై అలోక్ పాండే, రామకృష్ణ, నాగరంజని, శ్రీవల్లి, అజిత్ సబ్నిష్ ప్రసంగించారు. రెండవ రోజు సమావేశాలు ముషీరాబాద్‌లోని శ్రీ అరబిందో భవన్‌లో జరిగాయి. పతాక వందనంతో ప్రారంభమైన కార్యక్రమంలో శ్రీ అరవిందుల గీతా వ్యాసములు, కాంటాక్ట్ విత్ సైకిక్ బీయింగ్, చేతనతో జీవించడం వంటి అంశాలపై ప్రసంగాలు జరిగాయి. అనంతరం ములుగు శ్రీనివాస్ గైడెడ్ మెడిటేషన్ నిర్వహించారు. మధ్యాహ్నం తర్వాత బి.వి. రావు 'అగ్రికల్చర్ మరియు హోమియో'పై ప్రసంగించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సొసైటీలు చేపడుతున్న కార్యక్రమాలపై వరిగొండ కాంతరావు, సూర్యనారాయణ, విజయకుమార్, పద్మశ్రీ వివరించారు. సాయంత్రం ముగింపు సమావేశంలో కృతజ్ఞతా వందనాలతో కార్యక్రమం ముగిసింది. హైదరాబాద్ మహానగరంలో విజయవంతంగా ముగిసిన ఈ సమావేశాలపై సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# ట్రినిటీ విద్యార్థుల వృద్ధాశ్రమ సందర్శన




**కరీంనగర్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సాలేహ్‌నగర్‌లోని ట్రినిటీ – ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ విద్యార్థులు పద్మనగర్‌లోని భవిత వృద్ధాశ్రమాన్ని సందర్శించి హృదయాన్ని కదిలించే అనుభవాన్ని పొందారు. గ్రేడ్ I నుండి IX వరకు విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమం చిన్న మనసుల్లో కరుణ, సానుభూతి, సామాజిక బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా జరిగింది. చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్ దాసరి మమతా రెడ్డి, ప్రిన్సిపల్ రత్నమాల ప్రోత్సాహంతో జరిగిన ఈ సందర్శనలో విద్యార్థులు వృద్ధులతో సాన్నిహిత్యంగా మాట్లాడి, వారిని గౌరవించడం, చూసుకోవడం ఎంత ముఖ్యమో నేర్చుకున్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయకూడదని, వారిని ప్రేమతో ఆదరించాలని చైర్మన్ విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పండ్లు, బియ్యం, పప్పులు, కూరగాయలు, దుస్తులు, బెడ్‌షీట్లు వంటి అవసరమైన వస్తువులను విరాళంగా అందించారు. వృద్ధాశ్రమ నివాసితుల ముఖాల్లో కనిపించిన ఆనందం, పిల్లలు చూపించిన సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులను బాధ్యతగల, దయగల, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# గెలిపిస్తే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా





**గజ్వేల్, డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)** తిమ్మారెడ్డిపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి భూరోజు జగన్ చారి భరోసా ఇచ్చారు. తనను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపే దిశగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగిన జగన్ చారి, గ్రామాభివృద్ధికి స్పష్టమైన దృక్పథంతో ముందుకెళు న్నారు. ఇంతకుముందు తన తండ్రి బాల బ్రహ్మం సర్పంచ్‌గా చేసిన సేవలు, గ్రామ పాలనలో సంపాదించిన అనుభవం తనకు ప్రేరణగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాజకీయ అవగాహనతో పాటు ప్రజలతో ఉన్న సన్నిహిత సంబంధాలను బలంగా చేసుకుని, మండల స్థాయి నుంచి ప్రభుత్వ పథకాలను గ్రామానికి తీసుకొచ్చి అభివృద్ధిని వేగవంతం చేస్తానని తెలిపారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు, సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలుపైన ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన అన్నారు. "నన్ను నమ్మి ఓటేయండి నమ్మకంగా అభివృద్ధి చేస్తా" అనే నినాదంతో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న జగన్ చారి, గ్రామ భవిష్యత్తు కోసం బ్యాట్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. ప్రజల విశ్వాసమే తన బలం అని, ఆ విశ్వాసాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించడమే తన సంకల్పమని ఆయన ధీమాగా వెల్లడించారు.

# రావిచేడ్ గ్రామ సర్పంచిగా గోపాల్ విజయం



**కడ్తాల్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గోపాల్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 253 ఓట్ల తేడాతో గెలుపొందారు. గోపాల్ విజయం బిఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపగా, పార్టీ నాయకులు స్వీట్లు పంచుకుంటూ ఆనందోత్సవాలు నిర్వహించారు. గ్రామ ప్రజల మద్దతుతో సాధించిన ఈ విజయం స్థానికంగా బిఆర్ఎస్‌కు మరింత బలం చేకూర్చిందని నాయకులు పేర్కొన్నారు.

## శ్రీశైలం దేవస్థానం అన్న ప్రసాద వితరణకు గుంటూరు వాస్తవ్యులు లక్ష రూపాయలు విరాళం



**శ్రీశైలం ,** శ్రీశైలం దేవస్థానం అన్నప్రసాద వితరణకు శ్రీ జి.నాగేశ్వరరావు గుంటూరు వాస్తవ్యులు అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం రూ.1,00,000 /- లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు పి.దేవికకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి. ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ చిట్టి బొట్ల భరద్వాజశర్మ పాల్గొనున్నారు.

# ఇంధన పొదుపుతో దేశ అభివృద్ధి



**హుస్నాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కస్తూర్బా గాంధీ విద్యాలయంలో టీఎస్ రెడ్‌కో సహకారంతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ విద్యార్థినిలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇంధనాన్ని పొదుపుగా వాడితేనే దేశ అభివృద్ధి సాధ్యమని, భావితరాలకు ఇంధన వనరులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే డబ్బులు పొదుపు అలవాటు చేసుకోవాలని, అందుకోసం అమ్మ బ్యాంకులు, డాడీ బ్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా డిసెంబర్ 14 నుండి 20 వరకు విద్యార్థులు, మహిళా సంఘాలు, ప్రజలకు ఇంధన పొదుపు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గృహాలలో ఎల్ఈడి బల్బులు వాడాలని, సౌరశక్తి వినియోగాన్ని పెంచాలని, తరిగిపోతున్న ఇంధన వనరులను జాగ్రత్తగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. ఒక్క యూనిట్ విద్యుత్ పొదుపు చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తి చేసినంత ఫలితం వస్తుందని, ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆయన సూచించారు. పెట్రోల్, డీజిల్, సహజవాయువు, బొగ్గు వంటి పునరుత్పత్తి కాని వనరులను జాగ్రత్తగా వాడితేనే భావితరాలకు అందించగలమని వివరించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ విద్యాలయ ఇంచార్జ్ సంధ్యారాణి, సరిత, పి.ఈ.టి కళావతి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# డాన్స్ మాస్టర్ కల్లూరి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్




**నల్లగొండ, డిసెంబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ జిల్లా నకిరేకల్ కు చెందిన కల్లూరి వెంకటేశ్వర్లు తెలంగాణ నాట్య మేళం పై పరిశోధన చేసినందుకుగాను, ఉచితంగా బీద విద్యార్థులకు నాట్య విద్య నేర్పిస్తూ, భోజన వసతి కల్పిస్తూ, సేవా దృక్పథంతో చేస్తున్న సేవలకు గాను చెన్నై గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ రాజా అన్న మలై మందిరంలో యూనివర్సిటీ చైర్మన్ మాన్యూల్, తమిళనాడు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటేశన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సంపత్ కుమార్, అరుణాచల్ ప్రదేశ్ హిమాలయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రకాష్ దివ్యరాణ, నీలం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ షమీం అహ్మద్ లు గౌరవ డాక్టరేట్ ను అందజేశారు.

# పోలిశెట్టి జూలియన్ సేవలు అభినందనీయం



**నల్లగొండ, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఫాదర్ పోలిశెట్టి జూలియన్ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఇటీవల మలేషియా దేశంలోని కౌలాలంపూర్ లో గ్లోబల్ లీడర్స్ అవార్డ్స్ సెమినార్లో మదర్ తెరిసా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సంస్థ డైరెక్టర్ అయిన రెవరెండ్ ఫాదర్ పోలిశెట్టి జూలీయన్ ను ఘనంగా సన్మానించి అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు రైతులకు మహిళలకు అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నందుకు గాను అంతర్జాతీయ అవార్డు రావడం ఎంతో గర్వించదగ్గదని అన్నారు. 55 దేశాల ప్రతినిధుల పాల్గొన్న ఈ కార్యక్రమంలో అరుదైన పురస్కారం పొందడం జిల్లాకే గొప్ప పేరు అని కొనియాడారు. అనంతరం నల్లగొండ బిషప్ రెవరెండ్ కరణం ధమన్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ పొలిటికల్ జనరల్ సెక్రెటరీ పసల శౌరయ్య, లూర్దు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి మండలంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూరు, రాఘవాపూర్, రంగాపూర్, మారేడుగొండ, గుర్రాంపల్లి, రాగినేడు, కంగార్తి, ఫలితం, కాసుపల్లి, తరుకల, మద్దకుంత గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రజలను కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంకరకొండ సర్పంచిగా రాములు విజయం



**ఆమనగల్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్ మండల పరిధిలోని 12 గ్రామపంచాయతీల సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. శంకరకొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాములు 101 ఓట్ల తేడాతో విజయం సాధించారు. రాములు విజయం గ్రామంలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, నాయకులు స్వీట్లు పంచుకుంటూ సంబరాలు నిర్వహించారు. సర్పంచ్‌గా ఎన్నికైన రాములు మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## నూతన సర్పంచ్‌కు కురుమ సంఘం సన్మానం



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన సాయిల్ల శ్రావణి, మహేందర్‌ను బొమ్మకల్ డివిజన్ కురుమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ది నర్సయ్య, మ్యకల చంద్రయ్య, కనకయ్య, పరశురాములు, వీరయ్య, వెంకటేష్, లక్ష్మణ్, శంకర్, రాజు, శ్రీనివాస్, అంజనేయులు, నారాయణతో పాటు కులస్తులు పాల్గొన్నారు.

## మాలపల్లి సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో స్వర్ణలత - రాజు దూసుకుపోతున్నారు



**హుస్నాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచి, విపక్షాల మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా వెన్న స్వర్ణలత -రాజు ఇంటింటి ప్రచారంలో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. బ్యాట్ గుర్తుతో గెలుపు దిశగా దూసుకుపోతున్న ఈ ప్రచారానికి జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇన్చార్జి ఆరె కిశోర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, దళిత బహుజన సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు మద్దతు తెలిపారు. ప్రచారంలో ప్రజల నుంచి విస్తృత ఆదరణ లభిస్తుందని, 99 శాతం ఓటర్ల మద్దతు స్వర్ణలత-రాజుకు లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ అండదండలతో రాజు గ్రామానికి అభివృద్ధి తీసుకురాగలరని, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే స్థానిక నాయకుడిని గెలిపించాలని ఓటర్లను కోరారు. బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తుచేసుకుంటూ, దళిత సమాజం ఐక్యంగా నిలిచి స్వర్ణలత గిరాజును గెలిపించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆరె కిశోర్ విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో జాతీయ మాల మహానాడు నాయకులు మేకల శ్రీకాంత్, దుంద్ర సుమన్, వేరంగి సాయి పరమేశ్వర్, సొల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత




**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలబోతారం గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పైడి అజయ్ తండ్రి మహేష్ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా రూరల్ పోలీసులు ఉదయం పెట్రోలింగ్ సమయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## బీసీల ఓటు బీసీలకే



**పెద్దపల్లి, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించేందుకు బీసీలు తమ ఓటును వజ్రాయుధంలా ఉపయోగించాలని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ కొండి సతీష్ పిలుపునిచ్చారు. మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో 46 జనరల్ స్థానాల్లో 38 మంది బీసీ అభ్యర్థులు విజయం సాధించడం ప్రభంజనమని ఆయన పేర్కొన్నారు. జనరల్ స్థానాల్లో బీసీలు అధిక సంఖ్యలో గెలిచిన జిల్లాల్లో పెద్దపల్లి మొదటి స్థానంలో, గద్వాల్ రెండో స్థానంలో నిలిచాయని తెలిపారు. బీసీల తలరాతలు మారాలంటే బీసీల ఓటు బీసీలకే వేయాలని, ఈ నినాదంతో ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. జనరల్ స్థానాలు అగ్రకులాలకే అన్న భ్రమను చెరిపేసి, రానున్న ఎన్నికల్లో కూడా బీసీ అభ్యర్థులు గెలిచేలా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. జనరల్ స్థానాల్లో నిలిచిన బీసీ అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అండగా నిలిచి, బహుజన రాజ్యాధికారానికి బాటలు వేయాలని కొండి సతీష్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రశాంతంగా రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు



**కరీంనగర్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు కరీంనగర్ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మానకొండూరు, కేశవపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, చిగురుమామిడి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యక్షంగా సందర్శించి పర్యవేక్షించారు. డ్రోన్ కెమెరాల ద్వారా క్యూ లైన్, బందోబస్తు తీరును పరిశీలిస్తూ, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, శాంతియుతంగా సాగేందుకు అధికారులకు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని కమిషనర్ తెలిపారు.

## రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది సందర్భంగా కార్యక్రమం




**కరీంనగర్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జాతి సేవలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ నగరంలోని 63వ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 162, 163, 164, 166 బూత్‌లలో ఇంటింటికి కరపత్రాలు పంచుతూ కుటుంబ ప్రాధాన్యత, ఆధ్యాత్మిక విలువలు, సామాజిక సమర్థతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుటుంబమే నేను నుండి మనం వైపు ప్రయాణానికి తొలి అడుగు అని, వారంలో కనీసం ఒకసారి కుటుంబ సభ్యులందరూ కలిసి చర్చలు జరపడం, భజనలు చేయడం, ఇంట్లో వండిన ఆహారం అందరూ కలిసి భుజించడం వంటి సంప్రదాయాలను కొనసాగించాలని కరపత్రాల ద్వారా వివరించారు. పర్యావరణ పరిరక్షణ, పౌర నియమావళి పాటించడం, స్వదేశీ వస్తువుల వినియోగం, హైందవ చైతన్యం జాతికి రక్షణ అని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు, 63వ డివిజన్ శక్తి కేంద్ర ఇన్చార్జ్ రెడ్డేడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో నేరెళ్ల ధనలక్ష్మి, పబ్బల్ల ఆంజనేయులు, దయ్యాల కరుణాకర్, వోల్లెం సంజీవ్ కుమార్, కర్రే రాజా మల్లయ్య, బాగోతం ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

## వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల పరిశీలన



**కరీంనగర్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ దఫా పోలింగ్ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు. జిల్లాలోని ఐదు మండలాల్లో జరుగుతున్న ఎన్నికల కోసం 162 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయగా, కలెక్టర్ కార్యాలయంలోని స్క్రీన్‌ల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

## రాజీవ్ చౌక్ సుందరీకరణ పనులు ప్రారంభం




**కరీంనగర్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని టవర్ సర్కిల్ ప్రధాన కూడలి, గతంలో అల్ఫా చౌరస్తాగా పిలువబడిన ఈ ప్రాంతం, రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు తర్వాత రాజీవ్ చౌక్‌గా మారింది. గత ప్రభుత్వంలో స్మార్ట్ సిటీ పనులలో భాగంగా ఈ ప్రాంతం సుందరీకరణకు దూరంగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో రాజీవ్ చౌక్ సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. సుడా నిధులతో కొత్తగా రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం మున్సిపల్ అధికారులు పాత విగ్రహాన్ని తొలగించి, కొత్త విగ్రహం ఏర్పాటుకు ఏర్పాట్లు ప్రారంభించారు.

## రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నికలు



**శంషాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా సరాపు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈరోజు శంషాబాద్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్నికలు నిర్వహించగా, ఏకగ్రీవంగా విజయం సాధించారు.

# చల్లంపల్లిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**కల్వకుర్తి, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు విలువైనదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సాఫీగా సాగేందుకు ప్రజలందరూ ఎన్నికల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఖానాపూర్‌లో ఓటు వేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ప్రజలందరూ ఎన్నికల సిబ్బందికి సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బలరాం గౌడ్ ప్రచారంలో పాల్గొన్న నాయకులు



**చారకొండ, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చారకొండ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బలరాం గౌడ్ గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా పాల్గొన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రచారంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అంతటి రజిత, మల్లేష్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జబ్బు వెంకటేష్ యాదవ్, అచ్చంపేట ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు రాజగోపాల్, సింగిల్ విండో మాజీ చైర్మన్ లక్ష్మణ్, పదర మాజీ జడ్పీటిసి రాంబాబు, మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు జాల మల్లేష్ యాదవ్, నోముల సురేష్ గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.ప్రచారంలో నాయకులు ప్రజలను కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ఏకతాటిపైకి రావాలని కోరుతూ, పార్టీ బలపరిచిన అభ్యర్థి బలరాం గౌడ్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# శ్రీరామ నామమే జగత్ రక్ష

### సత్సంగ సమావేశంలో బండారి రమేష్




**షాద్‌నగర్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "హైందవ ఐక్యతే యావత్ భారతావనికి శ్రీరామరక్ష, శ్రీరామ నామమే జగత్ రక్ష" అని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని భగీరథ కాలనీ డ్రీమ్ విల్లాస్ కమ్యూనిటీ హాల్లో, విహెచ్‌పి నాయకురాలు పానుగంటి రోజా ఆధ్వర్యంలో జరిగిన సత్సంగ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండారి రమేష్ మాట్లాడుతూ కలియుగంలో మానవాళి యావత్తూ యుగపురుషుడు, పితృవాక్యపాలకుడు, ఏకపత్నీవ్రతుడు అయిన శ్రీరాముడి బాటలో నడవాలని పిలుపునిచ్చారు.సభలో విహెచ్‌పి విభాగ్ సహ కార్యదర్శి మఠం రాచయ్య, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయురాలు గంతల భాగ్యవతి, నరహరి, యోగ పానుగంటి శశిధర్, రంగయ్య, బాలబ్రహ్మాచారి, హనుమంత్ రెడ్డి, కోటేష్, హరితతో పాటు కాలనీ పెద్దలు, మహిళామణులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

# పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచార జోరు

-కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం.
- గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం.
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా చందంపేటమండలంలోని తెల్దేవారి పల్లి, పోలేపల్లి, మూడుదండ్ల గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం ఎమ్మెల్యే బాలు నాయక్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి, గ్రామ ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటితో గెలిపించాలని కోరారు. పలుకార్యక్రమాల్లో పాల్గొన్నారు .మూడుదండ్ల గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు కామ్రేడ్ పందిరి జనార్దన్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా జనార్ధన్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, ఘన నివాళి అర్పించారు. ఎర్రారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అనిల్ – శివాలీల యొక్క కుమార్తె వియన్షి జన్మ దినం సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. బ్యాలెట్ నమూనాను చూపిస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని గ్రామాల ఓటర్లను అభ్యర్థించారు.అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులను ఓటేసి గెలిపిస్తే గ్రామాలలో మరింత అభివృద్ధి పనులు జరుగుతాయాని అయన హామీ ఇచ్చారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలు, ఉచిత కరెంట్, దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు.ధాన్యానికి మద్దతు ధర, బోనస్ అందిస్తూ వడ్ల కటింగ్ లేకుండా చేయడం జరిగింది అని వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు, సర్పంచ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయం





-గత పదేళ్ళలో కేసీఆర్ గారు చేసిన అభివృధి సంక్షేమ పథకాలే మన అభ్యర్థులను గెలిపిస్తాయి.
-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి టోంగర్ ప్రతాప్ (చింటూ)కి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని మాట్లాడుతూ ,.గత పదేళ్ళలో కేసీఆర్ చేసిన అభివృధి సంక్షేమ పథకాలే మన అభ్యర్థులను గెలిపిస్తాయి అని ఆయన అన్నారు.గ్రామాల్లో బిఆర్ఎస్ సానుభూతిపరులను, కేసీఆర్ అభిమానులను ఏకం చెయ్యాలి అని కోరారు.రెండేళ్ల నుండి కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ చేసిన మోసాలు, బిఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమాన్ని గుర్తు చేస్తూ ప్రజల వద్దకు వెళ్లాలి అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజలు స్పష్టమైన అవగాహనతో ఉన్నారు అని ఆయన తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సర్వేలలో బిఆర్ఎస్ పార్టీదే హవా అని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ధైర్యం లేక ఇన్ని రోజులు కాలయాపన చేసింది అని ఆయన గుర్తు చేశారు.అతి తక్కువ సమయంలో ఎక్కువ వ్యతిరేకత మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన తెలిపారు.గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇస్తూ పార్టీ విజయానికి దోహదపడాలి అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడారి సైదులు,తీర్పతయ్య,గుండాల వెంకట్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో రెండో విడత పోలింగ్

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలన



**తిమ్మాపూర్, డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.తిమ్మాపూర్ మండలంలోని జోగయ్యపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రామకృష్ణ కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. అలాగే చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గన్నేరువరం మండలం గుండ్లపల్లి శ్రీరామకృష్ణ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అప్పటివరకు నమోదైన పోలింగ్ శాతం వివరాలు తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో క్రమ సంఖ్యను సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు.గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య, పోలింగ్ శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు కేంద్రం బయటే ఉండేలా చూడాలని సూచించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీపై బి.ఎల్.ఓలను ప్రశ్నించారు. పోలింగ్ మెటీరియల్‌ను జాగ్రత్తగా సంరక్షించాలని ఆదేశించారు.మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు.

# అహోబిలంలో కళ్యాణ్ మండప ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ.

### -భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తాం



**ఆళ్లగడ్డ, డిసెంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ కళ్యాణ మండపం ప్రహరీ గోడ నిర్మాణం కొరకు సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ ఆదివారం భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ కృష్ణ దేవరాయ కళ్యాణ మండప అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సంఘం తరపున కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాసేటి నాగిరెడ్డి, కొట్కూరు తిరుపాలు, పత్తి సూర్యనారాయణ, గూడూరు సంజీవ రాయుడు, యామా గురప్ప, కొల్లం పుల్లయ్య, సిద్ధి సత్యం, కొండపేట వీరయ్య, మైలేరి మల్లయ్య, పత్తి బ్రహ్మయ్య, రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, దూలం మెగా చైతన్య, బండి రామచంద్రుడు, డ్రైవర్ చిన్న నరసింహుడు, హరి కృష్ణ, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు,

# జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అమ్రాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేటలో నాగర్‌కర్నూల్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర ఎఐసిసి పరిశీలకులు, జిల్లా డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట శాసనసభ్యులు డా. చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మీరు ఇక్కడ పోటీ పడుతున్నది కేవలం జిల్లా స్థాయి విజయం కోసమే కాదు. ఈరోజు విజేతలకు డిసెంబర్ 21న శ్యామ్స్ ఫంక్షన్ హాల్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అద్భుత అవకాశం లభిస్తుంది. ఇది మన జిల్లా క్రీడాకారులకు లభించిన బంగారు అవకాశం. రాష్ట్ర స్థాయిలో మన జిల్లా పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. తైక్వాండో క్రీడలో వేగం, శక్తి, సాంకేతికతతో పాటు




క్రమశిక్షణ, గౌరవం, ఆత్మనిగ్రహం వంటి విలువలు అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఆడాలని, గెలిచిన వారిని అభినందించడం, ఓడిన వారిని ప్రోత్సహించడం నిజమైన క్రీడాకారుడి లక్షణమని వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులందరికీ ప్రభుత్వం తరపున, తన వ్యక్తిగత సహాయం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. శిక్షణ, ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని తెలిపారు. క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా, ధైర్యంగా పోటీల్లో పాల్గొని తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరుతూ, జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను అధికారికంగా ప్రారంభించినట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బల్మూర్ మండల పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, అప్ప శివ, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు

# అవినీతి -అరాచక శక్తుల చేతుల్లో గోపాలపురం!

**-బుడ్డర్ ఖాన్ బెదిరింపులకు భయపడొద్దు**
**-మిద్దె అశోక్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి**
**-కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టండి**
**-మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి డిసెంబర్ 14( నీలగిరి ఎక్స్ ప్రెస్):** మూడవ విడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా పానగల్ మండలం గోపాలపురం గ్రామంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి ఒక్కటంటే ఒక్కటి అమలు చేయకుండా మళ్లీ ఓట్లు అడగడానికి నైతిక హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతు భరోసా, రైతు రుణ మాఫీ, రైతు బీమా, ధాన్యానికి బోనస్, మహిళలకు రూ.2500,



వృద్ధులకు రూ.4000, వికలాంగులకు రూ.6000, తులం బంగారం, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో కార్మికులకు రూ.12,000, కె.సి.ఆర్ కిట్ ఏమయ్యాయని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. గోపాలపురాన్ని కొన్ని ఏండ్లుగా పెత్తనం చేస్తూ అవినీతికి పాల్పడుతున్న శక్తులను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. యువకుడు మిద్దె అశోక్‌ను గెలిపిస్తే తాను, బీరం హర్షవర్ధన్ రెడ్డి అండగా నిలబడి గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రామన్నగట్టు రిజర్వాయర్‌ను సాధించి గోపాలపురాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. మిద్దె అశోక్‌ను గెలిపిస్తే ప్రత్యేక ప్రణాళికతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, జిల్లా ఎస్.టి సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్, మండల కన్వీనర్ వీరసాగర్, మిద్దె కృష్ణ, మాజీ సర్పంచ్ చందు నాయక్, కొత్తగా మాజీ మంత్రి సమక్షంలో కిషోర్ శెట్టి పార్టీలో చేరి ఆయనతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలని వినతి

**మహబూబాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అత్యంత కీలకమైన జంక్షన్‌గా ఉన్న మహబూబాబాద్‌లో రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ప్రాజెక్టును తక్షణమే ఏర్పాటు చేయాలని బిజెపి మహబూబాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పైండ్ల శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మహబూబాబాద్ రైల్వే పరంగా చారిత్రక ప్రాధాన్యం కలిగిన కేంద్రం అని, విజయవాడ – కాజీపేట ప్రధాన రైల్వే మార్గంలో ఉన్న ఈ ప్రాంతంలో రైల్వే శాఖకు సంబంధించిన భూములు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం సాంకేతికంగా రైల్వే శాఖకు కూడా లాభదాయకమని పేర్కొన్నారు. ఈ భారీ ప్రాజెక్టు



వల్ల జిల్లాలోని వేలాది మంది నిరుద్యోగ యువతకు, ముఖ్యంగా వెనుకబడిన తరగతుల బిసి, దళిత, గిరిజన యువతకు రైల్వేలో సాంకేతిక ఉద్యోగాలు, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మహబూబాబాద్ ఇలాంటి ప్రాజెక్టుల ద్వారా ఆర్థికంగా బలపడుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రైల్వేల ఆధునీకరణకు పెద్దపీట వేస్తున్న తరుణంలో, మహబూబాబాద్ జిల్లాకు ఈ ప్రాజెక్టు మంజూరు చేయాలని, కానీ దీన్ని తరలించే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బిజెపి నేత బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వినతిపత్రం సమర్పించారని, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకువెళ్లి ప్రాజెక్టు సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా స్పందించి ఈ ప్రాజెక్టు మహబూబాబాద్‌కు వచ్చేలా చొరవ చూపాలని పైండ్ల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# పల్లకీ ఉత్సవం

**శ్రీశైలం,డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీశైలంలో లోకకల్యాణంకోసం దేవస్థానం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తుంది. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి



ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

# అమ్రాబాద్‌లో సిసి రోడ్ ప్రారంభోత్సవం



**అమ్రాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండల కేంద్రంలో సిసి రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు, సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్, మాజీ జెడ్పిటిసి అనురాధ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ముందు నుండి కొత్త బస్టాండ్ వరకు నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ గ్రామ సర్పంచ్ చిగుర్ల కోటయ్య, డిప్యూటీ సర్పంచ్ రాజారాం గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బాలింగం గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ముక్రం ఖాన్, టౌన్ అధ్యక్షుడు లక్ష్మణ చారి, గోలి మల్లేష్, జమీల్, తిరుమలయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ఇబ్రహీం, అమరేశ్వర దేవాలయం కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు. రోడ్ కాంట్రాక్టర్‌తో పాటు స్థానిక నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పెద్దలు కూడా హాజరయ్యారు.

# గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరాలి

- డాక్టర్ వంశీకృష్ణ



**అమ్రాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ బల్మూరు మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులను ప్రజలకు పరిచయం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ, "పల్లెలు అభివృద్ధి చెందాలంటే నాకు మరింత బలం కావాలి, మీరందరూ తోడ్పడాలి" అని ప్రజలను అభ్యర్థించారు. పోలిశెట్టిపల్లి, చెన్నారం, గోదల్, కొండారెడ్డిపల్లి, తుమ్మన్‌పేట్, పోలేపల్లి, జిన్‌కుంట, మంగలకుంటపల్లి, గట్టు, తుమ్మెన్, నర్సాయిపల్లి, అనంతవరం, అబగిరి, తోడేల్‌గడ్డ గ్రామాల్లో పర్యటన కొనసాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, కాశన్న యాదవ్‌తో పాటు అభిమానులు పాల్గొన్నారు.

# మిరాసిపల్లి సర్పంచ్‌గా మాధవి (వైదేహి) విజయం



**వనపర్తి డిసెంబర్ 14( నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొత్తకోట మండలం మిరాసిపల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతురాలు మాధవి (వైదేహి) ఘన విజయం సాధించారు. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఆమె బీఆర్ఎస్ మద్దతురాలు రాజేశ్వరిపై 295 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మాధవి విజయం సాధించిన వెంటనే కాంగ్రెస్ శ్రేణులు, గ్రామ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ఈ ఫలితం గ్రామంలో రాజకీయంగా కొత్త ఉత్సాహాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# పుదుచ్చేరి లో కొత్త రాజకీయ పార్టీ

### ఎల్‌జెకెను స్థాపించిన వ్యాపారవేత్త జోస్ ఛార్లెస్



**పుదుచ్చేరి డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు పుదుచ్చేరిలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటయింది. లచ్చియా జననాయక కచ్చి (ఎల్‌జెకె) అనే పేరుతో వ్యాపారవేత్త జోస్ ఛార్లెస్ ఆదివారం ఒక పార్టీని స్థాపించారు. లాటరీ కింగ్‌గా పేరుగడించిన శాంటియాగో మార్టిన్ కుమారుడైన జోస్ ఛార్లెస్ తన సంస్థ జెసిఎం మక్కల మండ్రం ద్వారా గత కొన్ని నెలలుగా 'సంక్షేమ కార్యక్రమాలు' నిర్వహిస్తున్నారు. రానున్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ సంస్థను రాజకీయ సంస్థగా మార్చాలని జోస్ ఛార్లెస్ నిర్ణయించుకున్నారు. ఆదివారం పుదుచ్చేరిలోని పాండి మెరీనాలో జరిగిన కార్యక్రమంలో పార్టీని ప్రారంభిస్తున్నట్లు ఛార్లెస్ ప్రకటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రపాలిత ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలోఉన్న ఎఐఎన్‌ఆర్‌సి-బిజెపి ప్రభుత్వం నిరుద్యోగం, గృహనిర్మాణం, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సౌకర్యాలు వంటి సమస్యలను పరిష్కరించడంలో విఫలమయిందని విమర్శించారు. అలాగే, ఈ కార్యక్రమానికి అధికార బిజెపికి అనుబంధంగా ఉన్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎం శివశంకర్, పి.అంగాలనే హాజరయ్యారు. ఎల్‌జెకె ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా బిజెపి మంత్రి ఎ జాన్‌కుమార్ కుమారుడు రీగన్ జాన్ కుమార్‌ను నియమించారు.


# అత్యాచార నిందితుడి క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించిన రాష్ట్రపతి



**న్యూఢిల్లీ: డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఒక హత్యాచార నిందితుడి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. 2021లో మహారాష్ట్రలో రెండేళ్లబాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన అనంతరం హత్య చేసిన రవి అశోక్ ఘుమారేకి సుప్రీంకోర్టు మరణ శిక్ష విధించింది. నిందితుడు సహజ, సామాజిక మరియు చట్టపరమైన అన్నినిబంధనలను అతిక్రమించాడని, అతనికి మరణశిక్షే సరైనదని 2019, అక్టోబర్‌లో సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. అతని క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించారని అధికారులు ఆదివారం వెల్లడించారు. ఇది రాష్ట్రపతి తిరస్కరించిన మూడవ క్షమాబిక్ష పిటిషన్ అని అన్నారు.

# జనవరి నుంచి పెరగనున్న టీవీల ధరలు!

### రూపాయి పతనం, చిప్‌ల కొరతే కారణం



**న్యూఢిల్లీ: డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వచ్చే ఏడాది జనవరి నుంచి టెలివిజన్ ధరలు పెరగనున్నాయి. మెమొరీ చిప్‌ల ధర అనూహ్యంగా పెరగడం, రూపాయి విలువ తగ్గి డాలర్‌తో రూపాయి మారకం విలువ 90 రూపాయలను దాటిన కారణంగా టీవీల ధరలు జనవరి నుంచి 3-4 శాతం పెరుగనున్నాయి. రూపాయి పతనం ఈ పరిశ్రమను అస్థిరమైన స్థితిలోకి నెట్టేసింది. టీవీల తయారీకి వినియోగించే విడి పరికరాల్లో 30 శాతం మాత్రమే దేశీయమైనవి కాగా, ఓపెన్ సెల్, సెమీ కండక్టర్ చిప్స్, మదర్ బోర్డు లాంటి ముఖ్య పరికరాలు దిగుమతి చేసుకుంటున్నారు. దీనికి తోడు ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో చిప్‌ల సంక్షోభం ఏర్పడటం టీవీల పరిశ్రమను ఇబ్బందుల్లోకి నెట్టింది. మెమొరీ చిప్‌ల పరిశ్రమలో సంక్షోభం కనుక మరో రెండు త్రైమాసికాలు ఇలాగే కొనసాగితే మరోసారి టీవీల ధరలు పెరగడం ఖాయమని ప్రముఖ బ్రాండ్ టీవీల తయారీ సంస్థ సూపర్ ప్లాస్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో అవ్‌నీత్ సింగ్ మర్వా తెలిపారు. ఇటీవల టీవీలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం వల్ల వినియోగదారుడికి కలిగిన ప్రయోజనం ఈ చిప్‌ల సంక్షోభం మింగేస్తున్నదని టీవీ డీలర్ ఒకరు పేర్కొన్నారు.

# 'ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తాం'


## పాకిస్థాన్ ఉగ్రవాది నోటి దురుసు..!



**న్యూఢిల్లీ: డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా కు చెందిన ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తామని అన్నాడు. ఢిల్లీని ఆక్రమిస్తాం అనే అర్థం వచ్చేలా ఈ వ్యాఖ్య చేశాడు. అదేవిధంగా భారత వైమానిక దళం పై కూడా ఆ ఉగ్రవాది నోరుపారేసుకున్నాడు.లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు. పాకిస్థాన్ ఆర్మీ అతడిని గతంలో సాధారణ పౌరుడిగా, అమాయకుడిగా పేర్కొన్నది. అయితే ఇప్పుడు భారత్‌పై దాడులకు బహిరంగంగా పిలుపునిస్తూ చేసిన వ్యాఖ్యల్లో అతడిలోని ఉగ్ర భావజాలం స్పష్టమవుతున్నది. తాజాగా అతడు మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో పోరాటం సమసిపోయిందనే వాదనలను కొట్టిపారేశాడు .జమ్ముకశ్మీర్‌లో పోరాటం ముగియలేదని, వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించాడు. ఎల్‌ఇటీ సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మక్కీని ఉద్దేశిస్తూ.. భారత రాజధానిని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు. ఈ సందర్భంగా ఢిల్లీని ఆక్రమిస్తామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశాడు. భారత సైనిక శక్తిపై కూడా రవూఫ్ నోరుపారేసుకున్నాడు. భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధవిమానాలు, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్‌లు అసమర్థమైనవిగా వ్యాఖ్యానించాడు.భారత వైమానిక దళం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించే ధైర్యం చేయదని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాడు. ఇస్లామిక్ దేశాల్లో పాకిస్థాన్ వద్ద మాత్రమే అసలైన అణ్వాయుధాలు ఉన్నాయన్నాడు.

# కొత్త సంవత్సరం 2026లోనూ రెండు చంద్రగ్రహణాలు..

## భారత్‌లో కనిపిస్తాయా..?



**న్యూఢిల్లీ: డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
త్వరలోనే కొత్త సంవత్సరంలో అడుగుపెట్టనున్నం. ఖగోళ ప్రియులకు గుడ్‌న్యూస్ కొత్త సంవత్సరంలో రెండు చంద్రగ్రహణాలు కనువిందు చేయబోతున్నాయి. 2025 సంవత్సరంలో రెండు చంద్రగ్రహణాలు ఏర్పడిన విషయం తెలిసిందే. కొత్త సంవత్సరంలో మార్చి, ఆగస్టు మాసాల్లో చంద్రగ్రహణాలు ఏర్పడనున్నాయి. వాస్తవానికి చంద్రుడు సొంతంగా ప్రకాశించలేడు. సూర్యకిరణాలు చంద్రుడిపై పడినప్పుడు అవి అక్కడి నుంచి ప్రతిబింబిస్తాయి.
అందుకే చంద్రుడు ప్రకాశించినట్లుగా మనకు కనిపిస్తుంది. సూర్యుడి చుట్టూ భూమి కక్ష్యలో ఉన్నప్పుడు, చంద్రుడు-సూర్యుడికి మధ్యలో భూమి వస్తుంటుంది. ఆ సమయంలో సూర్యకాంతి చంద్రుడిపై పడదు. సూర్యుడు, భూమి, చంద్రుడు వాటి కక్ష్యలో ఒకే వరుసలో ఉన్న సమయంలో మాత్రమే ఇలా జరుగుతుంది. ఆ సమయంలో భూమి నీడ చంద్రుడిపై పడుతుంది. దీంతో, చంద్రుడిపై నీడ ఉన్న భాగం చీకటిగా మారుతుంది. మనం భూమిపై నుంచి చూసిన సమయంలో ఆ భాగం మొత్తం నల్లగా కనిపిస్తుంది. దాన్నే మనం చంద్రగ్రహణంగా పిలుస్తుంటాం.

**గ్రహణాలు ఎప్పుడు..**
2026లో తొలి చంద్రగ్రహణం మార్చి 3న ఏర్పడుతుంది. ఇది పాక్షిక చంద్రగ్రహణం. ఈ గ్రహణం తూర్పు యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్, ఆర్కిటిక్, అంటార్కిటికా ప్రాంతాల్లో కనిపింది. అలాగే, భారత్‌లోనూ ఈ గ్రహణం దర్శనమిస్తుంది. భారత కాలమానం ప్రకాణం సాయంత్రం 6.26 గంటలకు మొదలై.. 6.46 గంటలకు ముగుస్తుంది. ఈ గ్రహణం వ్యవధి కేవలం 20 నిమిషాలు మాత్రమే. రెండో చంద్రగ్రహణం ఆగస్టు 28న ఏర్పడుతుంది. ఈ గ్రహణం భారత్‌లో కనిపించేందుకు అవకాశం లేదు. రెండో గ్రహణం యూరప్, వెస్ట్ ఆసియా, ఆఫ్రికా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్ ప్రాంతాల్లో కనిపిస్తుంది.

# మావోయిస్టుల ప్రభావం తగ్గిపోయింది !

### -ఆర్థికంగా బాగా దెబ్బతీశాం
### -కేంద్ర ప్రభుత్వ ప్రకటన



**న్యూఢిల్లీ: డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలో మావోయిస్టుల ప్రభావం బాగా తగ్గిపోయిందని, వారి ఆర్థిఖ మూలాలను కూడా దెబ్బతీశామని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గడచిన 11 సంవత్సరాల కాలంలో పలు భద్రతా సంస్థలు మావోయిస్టులను ఆర్థికంగా దెబ్బతీశాయని, రూ.92 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నాయని, వారి సమాచార యుద్ధ వ్యవస్థలలోకి ప్రవేశించి వాటిని తీవ్రంగా నియంత్రించడం ద్వారా అర్బన్ నక్సల్స్‌కు నైతిక, మానసిక నష్టాన్ని కలిగించాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 'ఎన్ఐఏలో మావోయిస్టులకు వ్యతిరేకంగా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో అది రూ.40 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంది. రాష్ట్రాలు మరో రూ.40 కోట్లకు పైగా స్వాధీనం చేసుకున్నాయి. రూ.12 కోట్లను ఈడీ జప్తు చేసింది. ఏకకాలంలో తీసుకున్న చర్యల కారణంగా అర్బన్ నక్సల్స్ నైతికంగా, మానసికంగా నష్టపోయారు' అని వివరించింది.
2014లో దేశంలో మావోయిస్టు ప్రభావానికి తీవ్రంగా గురైన జిల్లాలు 36 ఉండగా ఈ ఏడాది వాటి సంఖ్య మూడుకు తగ్గిందని కేంద్రం చెప్పింది. భద్రతా బలగాల ఆపరేషన్లలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 317 మంది మావోయిస్టులు మరణించారని, 862 మంది అరెస్టయ్యారని, 1,973 మంది లంగిపోయారని పేర్కొంది. గత సంవత్సరం ఒక కేంద్ర కమిటీ సభ్యుడు, ఈ ఏడాది ఐదుగురు సహా మొత్తం 28 మంది కీలక మావోయిస్టు నేతలు లంగిపోవడమో, అరెస్టవడమో లేదా ఎన్‌కౌంటర్లలో చనిపోవడమో జరిగిందని వివరించింది. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 27 మంది మావోయిస్టులు చనిపోయారు. మే 23న బీజపూర్‌లో 24 మంది లంగిపోయారు. అక్టోబరులో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో 258 మంది లంగిపోయారు. వీరిలో పది మంది సీనియర్ నేతలు. 2014లో దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాలు 126 ఉంటే ఇప్పుడు 11 మాత్రమే ఉన్నాయి. గత పది సంవత్సరాలలో పటిష్టవంతమైన పోలీస్ స్టేషన్ల సంఖ్య 66 నుంచి 586కు పెరిగింది. దేశంలో తీవ్రవాద సంబంధమైన ఘటనల సంఖ్య తగ్గింది. 2013లో 76 జిల్లాల్లో 330 ఘటనలు నమోదు కాగా ఈ ఏడాది జూన్ నాటికి 22 జిల్లాల్లో 52 ఘటనలు నమోదయ్యాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యల కారణంగా దేశంలో గడచిన 11 సంవత్సరాలలో నక్సల్స్ హింస 70 శాతం తగ్గింది' అని ప్రభుత్వం ఆ ప్రకటనలో వివరించింది. 2026 మార్చి 31 నాటికల్లా దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చాలని గడువు నిర్దేశించుకున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పదేపదే ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే.

# భారత్ నుంచి బంగ్లాదేశ్ వ్యతిరేక కార్యకలాపాలను అనుమతించం..




**న్యూఢిల్లీ: డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత్‌పై బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం చేసిన ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. బంగ్లాదేశ్ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఎలాంటి రాజకీయ కార్యకలాపాలను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాయుత ఎన్నికలకు తమ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించింది. ఢాకాలోని భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సమన్లు పంపడం, భారత భూభాగం నుంచి మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఎంఈఏ తాజాగా స్పందించారు. ఇండియాలో ఉంటున్న హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్‌కు చెందిన కొందరు నేతలు బంగ్లా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు ఢాకా చేసిన ఆరోపణలను ఎంఈఏ ఖండించింది. బంగ్లాదేశ్‌లో శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరగాలని ఇండియా కోరుకుంటోందని మరోసారి తెలిపింది. స్నేహపూర్వకమైన బంగ్లా ప్రజల ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను తమ భూభాగంపై అనుమతించేది లేదని స్పష్టం చేసింది. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడంతో పాటు అంతర్గత శాంతి భద్రతలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు తెలిపింది.



# లేడీ ఓరియెంటెడ్ కథకు గ్రీన్‌సిగ్నల్?

కథాంశాల ఎంపికలో కొత్తదనం, పాత్రలపరంగా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ దక్షిణాదిలో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది సాయిపల్లవి. ఈ ఏడాది 'తండేల్'తో ప్రేక్షకుల్ని అలరించిందీ భామ. ప్రస్తుతం హిందీలో భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'లో నటిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ అమ్మడు ఓ మహిళా ప్రధాన చిత్రంలో నటించబోతున్నట్లు తెలిసింది. గౌతమ్ తిన్ననూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని సమాచారం. బలమైన భావోద్వేగాలతో వెండితెరపై కథల్ని ఆవిష్కరిస్తుంటారు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. సాయిపల్లవిని దృష్టిలో పెట్టుకొని ఆయన ఓ అద్భుతమైన లేడీ ఓరియెంటెడ్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇటీవలే సాయిపల్లవికి కథ వినిపించారని, ఆమె ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకరించిందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ నిర్మించనుందని సమాచారం. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారి క ప్రకటన రావాల్సిందే.




# వైల్డ్ బ్లాక్‌బస్టర్ 'మోగ్లీ'..

## తొలి రోజే కోటి వసూళ్లు!

యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా నటించిన తాజా చిత్రం 'మోగ్లీ' బాక్సాఫీస్ వద్ద బోణీ అదిరింది. యువ దర్శకుడు సందీప్ రాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం డిసెంబర్ 13, 2025న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ టాక్ లభిస్తోంది. 'మోగ్లీ' తొలి రోజే కలెక్షన్ల పరంగా అదరగొట్టింది. ప్రపంచవ్యాప్తంగా మొదటి రోజే ఈ చిత్రం రూ. 1.22 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా వెల్లడించింది. ప్రీమియర్ షోలతో కలిపి ఈ మొత్తం కలెక్షన్స్ నమోదు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, "వైల్డ్ బ్లాక్‌బస్టర్" అంటూ చిత్ర యూనిట్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఓ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో రోషన్, సాక్షిలతో పాటు బండి సరోజ్ కుమార్, హర్ష చెముడు తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# టాలీవుడ్‌లో.. దూసుకుపోతున్న భాగ్యశ్రీ బోర్సే

మరాఠీ నటి భాగ్యశ్రీ బోర్సే తెలుగు సినిమా పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని వేగంగా ఏర్పరచుకుంటోంది. అందచందాలు, అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్, ఆకట్టుకునే నటనతో ప్రేక్షకులను, ముఖ్యంగా యువత ు విపరీతంగా ఆకర్షిస్తోంది టాలీవుడ్‌లో భాగ్యశ్రీ కెరీర్ ప్రయాణం ప్రారంభంలోనే పెద్ద హీరోలతో మొదలైంది. అయితే, కమర్షియల్ విజయాలు ఇంకా పూర్తి స్థాయిలో దక్కలేదు. రవితేజ కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటించిన తొలి సినిమా 'మిస్టర్ బచ్చన్' బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన చేసిన 'కింగ్ డమ్' సినిమాకు సైతం మిశ్రమ స్పందన వచ్చింది. ఈ చిత్రాలు కమర్షియల్ గా ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, ఆమె నటన, గ్లామర్ మాత్రం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి, ఇండస్ట్రీలో అవకాశాలు తెచ్చిపెట్టాయి. ఇటీవల రామ్ పోతినేనితో కలిసి నటించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా'లో భాగ్యశ్రీ తన నటన ప్రతిభను ప్రదర్శించి, తెలుగు ప్రేక్షకులలో అభిమానుల బలాన్ని మరింత పెంచుకుంది. మోడలింగ్ రంగం నుండి మెయిన్ స్ట్రీమ్ తెలుగు సినిమాలకు ఆమె వేగంగా మారడం మరియు ప్రతి ప్రాజెక్ట్ లో ఆమె చూపించే అంకితభావం, టాలెంట్ టాలీవుడ్‌లో ఆమెను ఒక ఎదుగుతున్న తారగా నిలబెట్టాయి. ఆమెకు ఇప్పుడు కావలసిందల్లా కేవలం ఒక ఘనమైన కమర్షియల్ విజయం మాత్రమే. ఒక్క పెద్ద హిట్ పడితే, ఆమె స్టార్ డం మరింత పెరగడం ఖాయం.కమర్షియల్ చిత్రాలతో పాటు, భాగ్యశ్రీ ప్రస్తుతం నటనకు ప్రాధాన్యత ఉన్న, విభిన్నమైన పాత్రల వైపు కూడా అడుగులు వేస్తోంది. తాజాగా 1990ల నాటి నిషేధిత (ప్రొహిబిషన్) కాలం నేపథ్యం మరియు సామాజిక అంశాల ఆధారంగా రూపొందనున్న ఒక మహిళా ప్రధాన చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే నటించనుంది.ఈ చిత్రంలో ఆమె సామాజిక సవాళ్లతో పోరాడే ఒక నిర్భయ యువతి పాత్ర పోషించనుందట. ఈ పాత్ర ఆమె నటనలోని మరొక కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం ఉంది. ఈ ఆసక్తికరమైన కథాంశం కలిగిన చిత్రాన్ని స్వప్న సినిమాస్, దర్శకుడు వేణు ఊడుగుల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది.వరుసగా పెద్ద ప్రాజెక్టులతో పాటు ఇలాంటి విభిన్నమైన, పీరియాడికల్ డ్రామాలో నటించే అవకాశం దక్కించుకోవడం భాగ్యశ్రీ బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం. సరైన ఒక్క ఘన విజయం దక్కితే, టాలీవుడ్‌లో ఈ మరాఠీ సుందరి స్థానం మరింత పదిలం కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.







# నవ్వులు, ట్విస్టులు డార్క్ కామెడీతో వస్తున్న 'గుర్రం పాపిరెడ్డి'.. ట్రైలర్ రిలీజ్

యంగ్ హీరో నరేష్ అగస్త్య, అందాల నటి ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న డార్క్ కామెడీ ఎంటర్‌టైనర్ 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రం డిసెంబర్ 19, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. ఒక శవాన్ని దొంగిలించడానికి శ్రీశైలం అడవిలోకి వెళ్లిన నలుగురు స్నేహితుల చుట్టూ తిరుగుతుంది. ఈ క్రమంలో జరిగే గందరగోళం, అనూహ్య మలుపులు, మరియు హాస్యాన్ని మిళితం చేసి ఈ సినిమాను రూపొందించారు. ట్రైలర్‌లో లెజెండరీ నటుడు బ్రహ్మానందం న్యాయమూర్తి పాత్రలో కనిపించడం, అలాగే తమిళ నటుడు యోగి బాబు కూడా కీలక పాత్ర పోషించడం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ సినిమాకు మురళిమనోహర్ దర్శకత్వం వహిస్తుండగా.. వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఎన్నాళ్ళకెన్నాళ్లకు.. ఫైనల్‌గా అయలాన్ తెలుగు రిలీజ్‌పై క్లారిటీ



కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ , రకుల్ ప్రీత్ సింగ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం అయలాన్. ఆర్ రవికుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీ తమిళనాడులో పొంగల్ కానుకగా జనవరి 12న విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. అయలాన్ తెలుగు వెర్షన్ ను కూడా అదే తేదీన (జనవరి 26న) తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల చేయాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల థియేటర్ల నుంచి తొలగించారు.కాగా తమిళ్ వెర్షన్ ఫిబ్రవరి 9 సన్ నెక్ట్స్‌లోకి వచ్చేసింది. అయితే తెలుగు వెర్షన్ ఎప్పుడు వస్తుందనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్ రాలేదు. అయితే తెలుగులో కూడా మేకర్స్ విడుదలకు ప్లాన్ చేసినప్పటికీ వర్కవుట్ కాలేదు. కానీ మేకర్స్ అప్పటినుంచి థియేటర్ రిలీజ్ అప్‌డేట్ లేదా ఓటీటీ రిలీజ్‌పై కూడా ఎలాంటి వార్త షేర్ చేయలేదు.తీవ్ర నిరాశలో ఉన్న తెలుగు మూవీ లవర్స్ కు ఫైనల్‌గా మేకర్స్ అదిరిపోయే వార్త అందించారు. అయలాన్ డైరెక్టుగా టీవీలో సందడి చేయనుంది. డిసెంబర్ 21న మధ్యాహ్నం 3 గంటలకు ప్రీమియర్ కానుంది. అయితే తెలుగు ఓటీటీ వెర్షన్ రిలీజ్‌కు సంబంధించి మాత్రం ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు మేకర్స్. అయలాన్ 2 కూడా తెరకెక్కించనున్నట్టు కేజేఆర్ స్టూడియోస్, ఫాంటోమ్‌ఎఫ్ ఎక్స్ స్టూడియో ఇప్పటికే సంయుక్తంగా ప్రకటన కూడా చేశాయి. సీక్వెల్ కోసం ప్రత్యేకించి రూ.50 కోట్లు కేవలం వీఎఫ్‌ఎక్స్, సీజీఐ పనుల కోసమే ఖర్చుపెట్టబోతున్నట్టు కూడా ప్రకటించారు మేకర్స్. ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషన్, ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.